క్లుప్తంగా

ఘనంగా అమ్మవారి ఆలయ వార్షికోత్సవం



రొంపిచర్ల: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయ 23వ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి లలిత సహస్రనామ కుంకుమార్చన పూజలు, సేవలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు వాకాని కోదండ రామాదీక్షితులు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త మద్ది రామచంద్రరావు, గొడవర్తి వెంకటేశ్వర్లు, కొప్పు కోటయ్య తదితరులు పర్యవేక్షించారు.

ఆర్టీసీ డిపోను సందర్శించిన ఎండీ



వినుకొండ(నూజెండ్ల): స్థానిక ఆర్టీసీ డిపోను ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా డిపో పరిసర ప్రాంతాలను, ప్రయాణికులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలో జరిగే మహాశివ రాత్రి పర్వదినానికి రాష్ట్రవ్యాప్తంగా శైవక్షేత్రాలకు బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ కార్గో సేవలు ప్రజలకు మరింత చేరువ చేసేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఆయన వెంట ఆర్ఎం శ్రీనివాసరావు, డిపో మేనేజర్ కోటేశ్వరనాయక్, ఆర్టీసీ ఉద్యోగులు ఉన్నారు.

చౌక్‌బాల్ పోటీలలో ఏఎంజీ విద్యార్థుల ప్రతిభ



చిలకలూరిపేట: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించటం అభినందనీయమని ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి చెప్పారు. మంగళవారం ఏఎంజీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన విద్యార్థినులు ఈ నెల 4,5 తేదీలలో తెలంగాణా రాష్ట్రంలో నిర్వహించిన దక్షణాది రాష్ట్ర చౌక్‌బాల్ పోటీలలో ఏపీ తరుపున ఆడి ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. ఏపీ జట్టులో సభ్యులైన తమ కళాశాల విద్యార్థినులు ఎం.హదస, టి.జ్యోతిర్మయి, టి.అంజలిలను అభినందించారు. కార్యక్రమంలో ఏఎంజీ డిప్యూటీ డైరెక్టర్ కెజియా మహంతి, ప్రిన్సిపాల్ లావణ్య పాల్గొన్నారు.

దుర్గగుడి ట్రస్ట్‌బోర్డు సభ్యురాలిగా కల్యాణి



నిడమానూరి కల్యాణి సురేంద్ర

నరసరావుపేట ఈస్ట్: విజయవాడ ఇంద్రకీలాద్రిపై వేంచేసియున్న శ్రీకనకదుర్గ అమ్మవారి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యురాలిగా పట్టణానికి చెందిన నిడమానూరి సురేంద్ర సతీమణి కల్యాణి నియామకం పట్ల పట్టణ ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి తన పాలనలో ఆర్యవైశ్యులకు ప్రాధాన్యతనిస్తూ రాష్ట్రంలో మహిమాన్వితమైన దుర్గమ్మ క్షేత్రంలో సేవ చేసుకునే భాగ్యాన్ని కల్పించటం ఆనందదాయకమని వాసవీ మిత్రమండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు తెలిపారు. దేవదాయశాఖ విడుదల చేసిన ఉత్తర్వులలో దుర్గమ్మ ఆలయ కమిటీ సభ్యురాలిగా పట్టణ వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి నిడమానూరి సురేంద్ర సతీమణి కల్యాణిని నియమిస్తూ ఉత్తర్వులు వెలువడటంతో నియోజకవర్గంలోని ఆర్యవైశ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

వైభవంగా కల్యాణం

నాదెండ్ల: గణపవరం-కావూరు డొంక రోడ్డులో కొలువైయున్న శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం సువర్చలాసమేత వీరాంజనేయస్వామి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ తొలి వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. తొలిరోజు ఆలయ ప్రధాన అర్చకులు పావులూరి మణికంఠాచార్యులు బృందం ఆ నిర్వహించారు. బుధవారం వార్షికోత్సవ సందర్భాన్ని పురస్కరించుకుని భారీ అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కాట్రు శ్రీనివాసరావు, ఆదిపూడి మల్లికార్జునరావు తెలిపారు. కార్యక్రమాలను కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం

- మళ్లీ ఆశీర్వదించడం మీ కర్తవ్యం
- మంత్రి విడదల రజిని
- బోయపాలెంలో గడప గడపకు కార్యక్రమం



బోయపాలెంలో గడప గడపకూ కార్యక్రమంలో లబ్ధిదారులకు బుక్‌లెట్లను అందిస్తున్న మంత్రి రజిని

యడ్లపాడు: రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్న సంక్షేమ పథకాలు బాగున్నాయని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం బోయపాలెం గ్రామంలో ఇంటింటి పర్యటన చేశారు. ముందుగా రామాలయంలో మంత్రి పూజను నిర్వహించి పార్టీ శ్రేణులతో కలిసి గడప గడపకు కార్యక్రమాన్ని ప్రారంభించారు.

యువకులు, నాయకులు, కార్యకర్తలు ఎంతో ఉత్సాహంగా ఆమె వెంట నడిచారు. మహిళలు మంత్రి రజినిని తోబుట్టువులా ఆప్యాయంగా పలకరిస్తూ సాదరంగా స్వాగతించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో తమకు లభించిన సంక్షేమ పథకాలు దండిగా అందాయని ఆనందంగా చెప్పుకున్నారు. మంచి చేసిన ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండి ఆశీర్వదించాలని మంత్రి కోరారు. ఇంటింటికీ లభించిన లబ్ధి వివరాలను తెలిపే బుక్‌లెట్లను మంత్రి కుటుంబ సభ్యులకు అందజేస్తూ ఇంకా సమస్యలు ఏమైనా ఉన్నాయా అంటూ తెలుసుకున్నారు. దీంతో వాల్మీకి నగర్, ఎస్టీ కాలనీల్లో డ్రైన్లు, రోడ్లు అధ్వానంగా ఉన్నాయని ఆయా సమస్యలను పరిష్కరించాలని స్థానిక ప్రజలు మంత్రికి విన్నవించుకున్నారు. ప్రాధాన్యత క్రమంలో ఆయా అభివృద్ధి పనులను చేపడతామని మంత్రి హామీ ఇచ్చారు. వాల్మీకి నగర్, ఎస్టీ కాలనీలోని అన్ని వీధుల్లో పార్టీ జెండాలతో కార్యకర్తలతో ఆద్యంతం ఎంతో ఉత్సాహంగా కార్యక్రమం కొనసాగింది. కార్యక్రమంలో చిలకలూరిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, వైఎస్‌చైర్మన్ ఎం.వీరారెడ్డి, ఎంపీపీ, వైఎస్ ఎంపీపీలు పి.ఝాన్సీ, షేక్ నాజులా సర్పంచ్ వడ్డేపల్లి నరసింహరావు, ఘంటా శంకర్, ఆర్.చింతారావు, బి.శివరామకృష్ణ, వి.శ్రీనుబాబు, శ్రీనివాసనాయక్, బొల్లయ్య, ఓ.పూర్ణయ్య, ఖాదర్‌బాష, సయ్యద్ మస్తాన్‌వలి, షేక్ అల్లాబక్షు(బుజ్జి), సుభాని, రవి, మంగయ్య, అంకారావు, ముజాఫా, షంషుజహా తదితరులు పాల్గొన్నారు.

డ్రైయినేజీ సమస్య పరిష్కరించాం

- ఇదే మా ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం
- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- 14 వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల) : 13, 14 వార్డుల్లో రైలు కట్ట వెంబడి మురుగునీరు నిలబడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తించి రూ.80 లక్షల నిధులతో డ్రెయినేజీ సమస్యను పరిష్కరించామని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వివరించారు. వినుకొండ పట్టణంలోని 14 వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేశారు. అనంతరం వార్డు ప్రజలనుద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి సహాయ సహకారాలతో వినుకొండరూపురేఖలు మారుస్తామని, రాష్ట్రంలోనే వినుకొండ నియోజకవర్గానికి గుర్తింపు తెస్తానన్నారు. వినుకొండ అభివృద్ధి గత ప్రభుత్వంతో పోల్చి చూసుకోవాలన్నారు. వినుకొండ నియోజకవర్గం ఏర్పడిన తరువాత ఈ సమస్యను పరిష్కరించిన వారు లేరని, ఇదే తమ చిత్తశుద్ధికి నిదర్శమన్నారు. ఏదైనా హామీ ఇస్తే నెరవేర్చి తీరుతామన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తుంటే టీడీపీ మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆక్రమణదారులకు అండగా ఉంటూ అభివృద్ధికి ఆటంకంగా మారారని అన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీ సభ్యులు, జీవీ అనుచరులు ఏబీఎం క్రిస్టియన్ మైనార్టీ ఆస్తులను ఆక్రమించారని, భూపోరాటం పేరుతో కొంతమంది ముస్లిం మైనార్టీ స్థలమైన మసీదు మాన్యాన్ని కూడా ఆక్రమించారన్నారు. తమ హయాంలో ఆక్రమణలకు అడ్డుకట్ట వేసి ప్రజలకు సంక్షేమం, సౌకర్యవంతమైన పాలన అందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. రానున్న రోజుల్లో వినుకొండ చుట్టూ పక్కలా బైపాస్ రోడ్లు, నాలుగు లైన్ల రహదారులు నిర్మిస్తున్నట్లు చెప్పారు. అభివృద్ధికి ఎవరు అడ్డుపడినా ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో 14వ వార్డు కౌన్సిలర్ జయరాజు, పార్టీ పట్టణ అధ్యక్షుడు పీఎస్ ఖాన్, కౌన్సిలర్లు ఎంఎస్‌కే బాషా, నంది నరసింహ రావు, సానాల పుల్లయ్య, యారం రామిరెడ్డి, ఎం.ఎల్.రెడ్డి, జడ్పీ కో ఆప్షన్ మెంబరు గుండాల స్వెనోమ్, మాజీ ఎంపీపీ ములకా రామతులసిరెడ్డి పాల్గొన్నారు.

12 నాటికి రహదారులు పూర్తికావాలి

- కోటప్పకొండలో పర్యటించిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- తిరునాళ్ల ఏర్పాట్ల పరిశీలన
- యల్లమంద వద్ద అప్రోచ్ రోడ్డు నిర్మాణం



యల్లమంద వద్ద అప్రోచ్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: కోటప్పకొండకు వచ్చే అన్ని రహదారులు ఈనెల 12వ తేదీకి సిద్ధం చేయాలనే లక్ష్యంతో పనిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అధికారులకు సూచించారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని ఈనెల 18వ తేదీన నిర్వహించే తిరునాళ్ల ఏర్పాట్లను పరిశీలించేందుకు మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి కోటప్పకొండలో పర్యటించారు. ప్రధానంగా రహదారులను ఆయన పరిశీలించారు. కొండకు వచ్చే ప్రధాన రహదారులతో పాటు లింక్‌రోడ్లను కూడా సిద్ధంగా ఉంచాలని సూచించారు. యల్లమంద వద్ద నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి పనులను పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసేందుకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉన్నందున తిరునాళ్లకు వచ్చే యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యామ్నాయంగా అప్రోచ్ రోడ్డును ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే కోటప్పకొండ-పమిడిమర్రు-జెఎన్‌టీయు కళాశాల మీదగా వినుకొండ రోడ్డు వరకు నూతనంగా నిర్మిస్తున్న రహదారి పనులను పరిశీలించారు. ఈ రహదారిలో ఆర్టీసీ బస్సును ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ నరసరావుపేట నుంచి యల్లమంద మీదగా కోటప్పకొండ రహదారి విస్తరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పి.చిట్టిబాబు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రైతులకు ఎలాంటి నష్టం రానివ్వం

- జిల్లా కలెక్టర్ శివశంకర్
- రహదారి విస్తరణ పనులను పరిశీలన



జొన్నలగడ్డలో జాతీయ రహదారి ఏర్పాటు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట రూరల్: రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా, వారి అభ్యర్థలను పరిగణలోకి తీసుకుని రహదారి నిర్మాణం చేపడతామని జిల్లా కలెక్టర్ శివశంకర్ తెలిపారు.మండలంలోని కేసానుపల్లి, జొన్నలగడ్డ, రావిపాడు గ్రామాల నుంచి నిర్మించనున్న జాతీయ రహదారి 167ఏ విస్తరణ పనులను జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ మంగళవారం పరిశీలించారు. జాతీయ రహదారి ఏర్పాటుకోసం విలువైన భూములను కోల్పోతామని అయా గ్రామాల ప్రజలు గతంలో అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. దీనిని దృష్టిలో ఉంచుకుని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లు జాతీయ రహదారి నిర్మాణ ప్రాంతాల్లో పర్యటించారు. ప్రత్యామ్నాయ చర్యలు తీసుకునేందుకు గల అవకాశాలు పరిశీలించాలని అధికారులకు సూచించారు. సాధ్యమైనంత త్వరగా రహదారి పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తహసీల్దార్ రమణానాయక్ వీరి వెంట ఉన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

రొంపిచర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 8వ తేదీన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎండీవో కె. మాథ్యూబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో మండలంలో నెలకొన్న సమస్యలపై, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుపై సమీక్షిస్తామన్నారు.

నాడు-నేడు పనులు పారదర్శకంగా జరగాలి

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామం జెడ్పీ ఉన్నత పాఠశాల్లో జరుగుతున్న నాడు-నేడు మనబడి పథకం జరుగుతున్న అభివృద్ధి పనులను ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ నాడు-నేడు పనుల్లో రూ. 69 లక్షల మంజూరు చేయగా అందులో భాగంగా బెంచీలు, శానిటరీ మెటీరియల్, 15 తరగతి గదులకు విద్యుత్ పైపులైను పనులు చేసినట్లు చెప్పారు. గదుల్లో రూ.14 లక్షల వ్యయంతో పాఠశాల్లో ఆరు గదులకు గ్రానైట్ బాలికలకు ప్రత్యేకంగా టాయిలెట్స్ నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యాతా ప్రమాణాలు పాటించాలని, అలాగే పారదర్శకంగా జరిగేలా నిరంతరం సచివాలయ ఇంజినీరు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పర్యవేక్షణ చేయాలన్నారు. ఆయనతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెరుకుపల్లి శంకర రంగారావు, పంచాయతీ కార్యదర్శి చింతా శ్రీనివాసరావు, పీఈటి పాదిలి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు సురేష్ ఉన్నారు.

'ఆరోగ్య యోజన' నమోదు పురోగతి పెంచాలి

శావల్యాపురం: ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన ఆయుష్మాన్ నమోదు ప్రక్రియ వేగవంతమయ్యేలా క్షేత్రస్థాయిలో గ్రామసచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు సంయుక్తంగా పురోగతి పెంచాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మాట్లాడుతూ మొదటి విడతలో 5890 నివాస గృహాల్లో 17667 మంది కుటుంబ సభ్యులను నమోదు చేయాల్సి ఉండగా 6871 మందిని ప్రభుత్వం రూపొందిన యాప్‌లో నమోదు చేసినట్లు చెప్పారు. భారతదేశంలో ఏ రాష్ట్రంలోనైనా రూ. 5 లక్షల వరకు ఉచితంగా వైద్య సేవలు పొందటానికి ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో ఈనమోదు చేసిన తదుపరి ఈకేవైసీ చేయాలన్నారు. దీంతో ఈ పథకానికి లబ్ధిదారులు అర్హత పొందుతారన్నారు.అనంతరం శావల్యాపురంలో జరుగుతున్న విధానాన్ని అధికారులు పరిశీలించారు. ఈకార్యక్రమంలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ సభ్యులు జడ ప్రశాంతి ఆరోగ్య కార్యకర్త ఇంకోల్లు నాగలక్ష్మి, సచివాలయ ఉద్యోగులు సింధుజ, గౌసియా బేగం, వలంటీర్లు ఉన్నారు.

ఘనంగా పునఃప్రతిష్టా మహోత్సవాలు



ప్రత్యేక పూజలలో పాల్గొన్న భక్తులు

వినుకొండ టౌన్: పట్టణంలోని పాత మార్కెట్ బజార్, శివాలయం ప్రక్కన ఉన్న చలివేంద్ర ఆంజనేయ స్వామి దేవస్థానం పున: ప్రతిష్ఠ కార్యక్రమాలలో భాగంగా మూడవ రోజు మంగళవారం విగ్రహాలకు ప్రభాత సేవ, ప్రత్యేక పూజలు, అనుష్ఠానములు, హోమాలు, భూత బలి, గ్రామ ప్రదక్షిణ, ధాన్యాధివాసము, నీరాజనం, మహా మంత్ర పుష్పం నిర్వహించినట్లు ఆలయ అభివృద్ధి, పున: నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు.

దేవస్థానంలో గణపతి, సుబ్రహ్మణ్య, సతీసమేత నవగ్రహ, శిఖర కలశ ప్రతిష్ఠా కార్యక్రమాలను అవ్వారి ఉమాశంకర దీక్షితులు శర్మ, వేద పండితులచేత ఆలయ అనువంశిక అర్చక స్వామి, జ్యోతిష్య వాస్తు సిద్ధాంతి చంగవల్లి వెంకట శ్రీరామ చంద్ర బాబు శర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమాలు ఐదు రోజులపాటు నిర్వహిస్తుండగా ఈ నెల 9న యంత్ర స్థాపన, విగ్రహ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి, పున: నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొని భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. చివరి రోజు భక్తులకు అన్న సంతర్పణ జరుగుతుందన్నారు.

అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలకు ముప్పాళ్ల విద్యార్థులు



నెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపిన ఎల్.శ్రీకాంత్‌రెడ్డి, జి.సాల్మన్‌రాజు, కె.భానుప్రకాష్‌లు

ఈపూరు: మండలంలోని ముప్పాళ్ల ధనలక్ష్మి వ్యాయామ కళాశాలకు చెందిన విద్యార్థులు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల నెట్‌బాల్ పోటీల్లో తృతీయ స్థానం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చుండు వెంకట్రావు తెలిపారు. ఈ నెల 6వ తేదీన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వ్యాయామ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో పురుషుల నెట్‌బాల్ పోటీల్లో కళాశాలకు చెందిన ఎంపీఈడీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎల్. శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీఈడీ మొదటి సంవత్సరం చదువుతున్న జి.సాల్మన్‌రాజు, బీపీఈడీ మొదటి సంవత్సరం చదువుతున్న కె.భానుప్రకాష్‌లు ప్రతిభ కనపరిచి తృతీయస్థానం సాధించారన్నారు. వీరు ముగ్గురు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జట్టు తరపున ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు బెంగుళూరులో జరిగే అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

ఆల్ ఇండియా విశ్వవిద్యాలయాల పోటీలకు విద్యార్థి ఎంపిక

మండలంలోని ముప్పాళ్ల ధనలక్ష్మి వ్యాయామ కళాశాలకు చెందిన ఎంపీఈడీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న డి.అయ్యప్ప ఈ నెల 4వ తేదీన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ వ్యాయామ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ కళాశాలల బేస్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనపరిచి ఆల్ ఇండియా విశ్వవిద్యాలయాల పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చుండు వెంకట్రావు తెలిపారు. ఈ నెల 14 నుంచి 18 వరకు రాయల్ గ్లోబల్ యూనివర్సిటీ, అస్సాంలో జరిగే అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ చుండు వెంకట్రావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మేదరమెట్ల రామశేషగిరిరావు, అధ్యాపకులు వై.సురేష్, ఆర్.బలరాంనాయక్, ఎం.సురేష్ కుమార్, ఎం.దాసులు అభినందించారు.



బేస్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపిన డి.అయ్యప్ప

ఆర్‌బీకేల ద్వారా ఎన్నో సేవలు



రికార్డులను పరిశీలిస్తున్న ఏవో రామారావు

ఈపూరు: ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా పలు రకాల సేవలు అందిస్తుందని, వాటిని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి రామినేని రామారావు తెలిపారు. మండలంలోని చిట్టాపురం, ముప్పాళ్ల రైతు భరోసా కేంద్రాలను ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ వ్యవసాయ సహాయకులు రైతు భరోసా కేంద్రంలో నిర్వహించాల్సిన విధులు, రిజిస్టర్లు గురించి తగు సూచనలు తెలియజేశారు. ఆర్‌బీకే చానల్ ద్వారా రైతులకు నేటి పద్ధతులలో సాంకేతిక పరిజ్ఞాన వినియోగం గురించి తెలియజేశారు. కియోస్క్ పని తీరు, ఆన్‌లైన్‌లో ఎరువులు ఎలా విక్రయించాలో వివరించారు. అనంతరం వరి, మొక్కజొన్న పంట పొలాలను సందర్శించి ఆయా పంటల సాగులో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను రైతులకు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు సీహెచ్. తిరుమల, ఆర్. శివగాయత్రి, రైతులు పాల్గొన్నారు.

రబీలో వరిపంట కోత ప్రయోగం



కారుమంచిలో పంట కోత ప్రయోగంలో పాల్గొన్న అధికారులు

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామంలో రబీ సీజనులో సాగు చేసిన వరి పంటకోత ప్రయోగం కార్యక్రమం చేపట్టినట్లు ఏఈవో పురేటి అశోకా మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా (ఎన్ఎస్‌వో ఎఫ్‌వోడి) గుంటూరు జిల్లా జాతీయ ఆహార భద్రత అధికారి కె.ఆనంద్ గోపాల్‌రావు పంట కోత ప్రయోగాన్ని స్వయంగా పరిశీలించి మాట్లాడుతూ రైతులు సాగు చేసిన వివిధ రకాల పంటల ఉత్పత్తుల ఆధారంగా ఎగుమతులు, దిగుమతులు చేసుకునేందుకు వీలుగా ఉంటుందన్నారు. పంట కోత ప్రయోగాలు వలన రైతులకు మేలు జరుగుతుందన్నారు. కారుమంచి గ్రామంలో రైతు బొమ్మినేని సుబ్బాయమ్మ వరి పంటకోత ప్రయోగం చేయగా ఎకరానికి 44 సంచులు దిగుబడి అయినట్లు గుర్తించామన్నారు. ఈ ప్రయోగంలో వీహెచ్ఎ జె.ప్రసాదు, రైతులు పాల్గొన్నారు.

వ్యసనాలతో భవిష్యత్ అంధకారం

మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ బాషా

నాదెండ్ల: మత్తుపదార్థాలు, దుర్వ్యసనాలతో యువత భవిష్యత్‌ను అంధకారం చేసుకుంటున్నారని గుంటూరుకు చెందిన మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ బాషా చెప్పారు. గణపవరం చుండి రంగనాయకులు కళాశాలలో చిలకలూరిపేట ఒయాసిస్‌వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో యువత దుర్వ్యసనాలు - జీవితంలో నష్టాలు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ళ జయమ్మ అధ్యక్షత వహించిన సదస్సులో డాక్టర్ బాషా మాట్లాడుతూ, సిగరెట్, పాన్‌పరాగ్, మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత అలవాటుపడి, శారీరకంగా, మానసికంగా దెబ్బతింటున్నారన్నారు. ఈ కారణంగా ఉపాధి అవకాశాలను సైతం కోల్పోతున్నారన్నారు. సోషల్ మీడియా, ప్రేమ వ్యవహారాల కారణంగా చదువులకు ఆటంకం ఏర్పడుతోందన్నారు. వీటికి దూరంగా ఉండాలన్నారు. మానసిక వ్యాధుల గురించి విపులంగా వివరించారు. కందిమళ్ళ జయమ్మ మాట్లాడుతూ, విద్యార్థులు దుర్వ్యసనాల బారిన పడకుండా మంచి పౌరులుగా ఎదిగి సమాజాభివృద్ధికి దోహదపడాలన్నారు. అనంతరం దుర్వ్యసనాలకు దూరంగా ఉంటామని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. డాక్టర్ బాషాను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కరణం విజయ, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రఫుల్లా దేవి, ఉపాధ్యక్షురాలు కోలా విజయలక్ష్మి, కందిమళ్ళ నారాయణమూర్తి, ప్రిన్సిపల్స్ ఎం.శ్రీనివాసరావు, పి.రాజ్యలక్ష్మీ, వైస్ ప్రిన్సిపల్ సీహెచ్ చైతన్య పాల్గొన్నారు.

చైల్డ్ ఇన్ఫోలో వివరాలు నమోదు చేయాలి



నమోదు ప్రక్రియ పరిశీలిస్తున్న అధికారులు

చిలకలూరిపేటటౌన్: ప్రీ ప్రైమరీ స్టూడెంట్స్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ను మంగళవారం పలు ప్రైవేటు పాఠశాలలో నిర్వహించారు. ఏపీ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ చదువుతున్న విద్యార్థుల వివరాలను చైల్డ్ ఇన్ఫోలో నమోదు చేయాలని జిల్లా నోడల్ ఆఫీసర్ కేవీ సత్యం చెప్పారు. గుంటూరు, బాపట్ల నోడల్ ఆఫీసర్లతో కలసి పట్టణంలోని పలు ప్రైవేటు విద్యాసంస్థల్లో నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధార్ కార్డు లేని విద్యార్థుల సమాచారాన్ని నమోదు చేయాలన్నారు. ఆధార్ కార్డు వచ్చిన తర్వాత వివరాలు అప్‌డేట్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవోలు కె. లక్ష్మి, జ్యోతికిరణ్. ఏఎస్‌వో పద్మారావు, ఏపీవో శంకర్‌రాజు పాల్గొన్నారు.

ఓటీఎస్ సద్వినియోగం చేసుకోవాలి

నాదెండ్ల: బ్యాంకుల్లో రుణాలు పొంది ఎన్‌పీఏ అయిన ఖాతాదారులకు ఆర్‌బీఐ ఒన్ టైమ్ సెటిల్మెంట్ అవకాశాన్ని కల్పించినట్లు గణపవరం ఎస్‌బీఐ బ్రాంచి మేనేజర్ కె.సునీత చెప్పారు. ఈ ఏడాది మార్చి వరకూ ఈ అవకాశాన్ని సంబంధిత ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్‌పీఏ అయిన రైతులు, చిరువ్యాపారులు, కార్పొరేషన్లలో రుణాలు పొందిన వారు తమ బ్యాంకు పరిధిలో 229 మంది ఉన్నారన్నారు. గడిచిన మూడు నాలుగేళ్ళ క్రితం బ్యాంకుల్లో ఖాతాలు ఉండి, లావాదేవీలు లేనటువంటి ఖాతాదారులు కూడా పునరుద్ధరణ చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఇర్లపాడులో రైతుల ఘర్షణ

నాదెండ్ల: మండలంలోని ఇర్లపాడు గ్రామంలో మంగళవారం పంటపొలాలపై నీళ్లు వదిలారంటూ రైతులు ఘర్షణ పడ్డారు. ఏరియా ఆసుపత్రి నుంచి పోలీసులకు అందిన సమాచారం మేరకు ఇర్లపాడు గ్రామానికి చెందిన అన్నదమ్ములు కొప్పుల వీరయ్య, వెంకటసుబ్బయ్యలు, వీరి మేనల్లుడైన శేషగిరి, పూర్ణె కేశవ లు ఇదే గ్రామానికి చెందిన తండ్రి కొడుకులు పసల హనుమంతరావు, సాంబశివరావులపై దాడి చేశారు. ఈ క్రమంలో పసల సాంబశివరావుకు గాయాలు కాగా, ఆయన్ను నరసరావుపేట ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.